# సౌందర్యారాధకుడు

మన్నె సత్యనారాయణ

ఆనందమూర్తి గ్రీకులవంటి సౌందర్యారాధకుడు! ప్రకృతి యొక్క ప్రతి వస్తువులోనూ అందాన్ని గుర్తించి ఆహ్లాదపడుతూ వుంటాడు. కొండలు, వాగులు, వంకలూ, చెట్లు చేమలూ, పచ్చిక బయళ్ళూ- అన్నీ కూడా ప్రకృతి యొక్క లాస్యరూపమని అతని అభిప్రాయం!

'స్త్రీ పురుషుల్లో స్త్రీ ఎక్కువ అందమైనది. ప్రకృతి తన అమూల్యమైన సౌందర్య సంపదనంతా స్త్రీలో ఇమిడ్చి పెట్టింది. స్త్రీలలో మరింత అందమైన వారిని చూసినపుడు అనిర్వచనీయమైన ఆనందానుభూతి కలుగుతుంది!' అంటాడు.

"Beauty is joy' (అందమే ఆనందం) అని ఆంగ్ల కవి కీట్స్ కీర్తించిన కవితను విడమర్చి విశదీకరించి స్నేహితులకు చెబుతాడు.

అందమైన ప్రకృతిని బొమ్మలుగా గీస్తాడు. అతను చిత్రకారుడు కూడా! వివిధ వయస్సుల్లోని స్త్రీల బొమ్మలను అందంగా వేస్తాడు. అవన్నీ కూడా చూడచక్కగా వుంటాయి. అందుక్కారణం, ఆ చిత్రాల్లో స్త్రీత్వ విలాసం, ఆడతనం నిండివుండటమే!

అతని వరస చూసి, తల్లికో అనుమానం కలిగింది. అందమంటే అంతులేని ఆరాధనవున్న వీడికి ఏ పిల్లయినా నచ్చుతుందా అని!

అదే నిజమయ్యింది. అతనికి పెళ్ళి సంబంధాలొస్తున్నాయి. ఎందుకు రావు! శ్రీమంతులైన తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. బాగా చదువుకున్నాడు. అందంగా వుంటాడు.

''సుబ్బారావుగారి సంబంధమొచ్చింది. పిల్ల బావుంటుందంట. ఓసారెళ్ళి చూసొద్దాంరా'' అంది తల్లి.

''ఎందుకమ్మా చూడ్డం? తీరా చూసాక మనకు నచ్చకపోతే?'' అన్నాడు.

''నచ్చకపోతే మానేస్తాం'' అందావిడ.

''అమ్మా! ఒక ఆడపిల్లను చూసి 'నీవు నచ్చలేదు' అంటే, ఆ అమ్మాయి ఎంత నొచ్చుకుంటుందో ఆలోచించు.''

''బావుందిరా నీవరస! అలా అనుకుంటే ఎలా? మరి పెళ్ళి చూపులెందుకు?'' అంది.

''అందుకే వద్దంటున్నాను. నాకు నచ్చిన పిల్ల కనిపించినపుడు నీకు చెబుతాను. మీక్కూడా నచ్చితే ఆ సంబంధం కుదర్చండి. అంతవరకూ మాట్లాడకండి'' అన్నాడు ఖచ్చితంగా.

అలాగే, వచ్చిన నాలుగైదు సంబంధాలు దాటపెట్టాలని తల్లి విసుక్కొంటోంది.

ఆ తర్వాత రాయుడిగారి సంబంధమొచ్చింది.

''రాయుడుగారమ్మాయిని చేస్తామంటున్నార్రా. వాళ్ళది బాగా కలిగిన కుటుంబం, నీకు తెలుసుకదా. పిల్లని మొన్న పెళ్ళిలో చూసాను. నీకు తప్పకుండా నచ్చుతుంది. చక్కగా బొమ్మలా వుంది. చూడ్డానికెళదాంరా'' అంది తల్లి.

అతనేదో చెప్పబోయాడు. ఆవిడొప్పుకోలేదు. అంతేకాదు, నిష్ఠూరంగా మాట్లాడింది.

'సరే, ఆవిడ్నెందుకు కష్టపెట్టాలి! పిల్ల అందంగా వుంటుందంటోంది కదా. బాగుంటే చేసుకుంటాను' అనుకుని తల్లిదండ్రులతో కలిసి చూడ్డానికెళ్ళాడు.

రాయుడిగారిది పాతకాలపు పెద్ద మండువా లోగిలి. ఆయన భూస్వామి.

ఆ అమ్మాయి వారి ముందుకు నడిచొస్తుంటే చూసాడు ఆనందమూర్తి. 'అమ్మ చెప్పింది నిజమే. అద్భుతమైన అందం!' అనుకున్నాడు.

అమ్మాయిని తీసుకొచ్చి వారికి ముందుగా చాపమీద కూర్చోపెట్టారు. బిడియపడకుండా చూసాడు. 'చాలా అందంగా వుంది' అనుకున్నాడు.

ఆ తర్వాత కొద్ది క్షణాలకు అతనిలోని కళాకారుడు పరిశీలన ప్రారంభించాడు- 'ఆ ముక్కు ఇంకాస్త కొనతేలి వుంటే, ఆ ముఖానికి సరిపోను- చెవులు కాస్త చిన్నవైనట్లున్నాయేంటి? పెదవుల వొంపు కాస్త తగ్గితే బావుండును- భుజాలు సరిపోయాయి- కాని నడుం దగ్గర వొంపు ఇంకాస్త లోపలికుంటే బావుండేది...'

ఇంటికొచ్చాక తల్లి అడిగింది.

''ఏరా, అమ్మాయి బావుంది కదా!''

''బాగానే వుందనుకుంటాను. కాని.. ఒద్దులే అమ్మా.'' అన్నాడు.

తల్లి విసుక్కుంది. విసుక్కోవడమేకాదు, ''ఇంక నీకే పిల్లా నచ్చదు. అసలు నీ పెళ్ళి మేం చూస్తామోలేదో'' అంది నిష్ఠూరంగా.

''లేదమ్మా. నే పెళ్ళి చేసుకోకుండా వుండిపోతే నాకు నచ్చిన పిల్ల దొరుకుతుంది. నీకు చెబుతా'' అన్నాడు, తల్లిని అనునయించడానికి.

ఆవిడ భర్తతో అని బాధపడింది.

''పిల్ల నచ్చలేదని ఇలా ప్రతి సంబంధం చెడగొడుతున్నాడు. అసలు వీడికి పెళ్ళవుతుందంటారా?'' అంది.

''వాడికి స్త్రీ మీద కోరిక పుట్టాలి. కోరిక పుడితే, అంత అందంగా లేకపోయినా కూడా నచ్చుతుంది. వాడే చేసుకుంటాడులే. నీవేమీ కలత పడకు'' అన్నాడాయన.

ఆవిడ అప్పటికి సరిపెట్టుకుని వూరుకుంది.

ఆనందరావుకు తను నచ్చలేదన్నాడని రాయుడుగారమ్మాయికి తెలిసింది. 'ఈ బడాయిగాడు నాకంటే ఎంత అందగత్తెను తెచ్చి చేసుకుంటాడో చూస్తాను' అనుకుంది.

తన అందం మీద ఆమెకంత నమ్మకం!

అయిదారు మాసాలు గడిచాయి. ఒకనాడు తీరిగ్గా కూర్చున్న తల్లి దగ్గరకొచ్చి ఆనందరావు తనే అన్నాడు-

''అమ్మా, నా పెళ్ళి గురించి వూరకనే ఆరాటపడిపోతున్నావు. సరే, నాకో పిల్ల నచ్చింది. మీక్కూడా నచ్చితే ఖాయం చెయ్యండి.''

ఆవిడ సంతోషపడిపోయింది. ఇప్పటికైనా కొడుకి పెళ్ళిమీద మనసు కుదిరినందుకు.

''ఎవర్రా పిల్ల? మన కులమేనా?'' అంది ఆతృతగా.

''నేను సంఘ సంస్కర్తను కానులే. మన కులమే. మన బంధువుల పిల్లే. కామరాజు మామయ్యగారమ్మాయి నీరజ'' అన్నాడు.

ఆ సంగతి విని అతని తల్లి తండ్రీ కూడా విస్తుపోయారు. నలుగురైదుగురు పెళ్ళి సంబంధాల వాళ్ళొచ్చి ఆ పిల్ల నచ్చలేదని వెళ్ళిపోయారు. పైగా, ఆమె నల్లగా వుంటుంది. 'ఇందరు అందమైన ఆడపిల్లలు నచ్చలేదన్న వీడికి, ఈ అమ్మాయెలా నచ్చింది' అనుకుని ఆశ్చర్యపడ్డారు.

''ఏరా ఆ అమ్మాయినసలు నీవు చూసావా? అంత బావుండదు'' అంది తల్లి.

''చూసానమ్మా. నాకు నచ్చింది. మీక్కూడా నచ్చితే కుదర్చండి. మీకు నచ్చకపోతే మరో సంబంధం చూసుకుందాం. మనకు తగిన కట్నం వాళ్ళివ్వరేరని మీకనిపిస్తే, నాకు మాత్రం కట్నం పట్టింపులేదు'' అన్నాడు.

''కట్నం పట్టింపు మాకూ లేదు. అమ్మాయి బావుండదనే అంటున్నాను'' అందావిడ.

''నాకు నచ్చింది'' అన్నాడు, మరో మాటకు ఆస్కారమివ్వకుండా.

ఆవిడ తికమక పడసాగింది. అతని అంతరంగంలో ఏమున్నదో ఆవిడకు అర్థం కావడంలేదు. తర్వాత భర్తతో అంది.

''ఏవిటి వీడు! వీడి వరస నాకేమీ అర్థం కావడం లేదు. ఆ పిల్ల వీడికెలా నచ్చింది?'' కొంచెం నిరాశగా అంది.

ఆవిడ భర్త అప్పటికే కొడుకు ఆలోచనతో సమాధానపడ్డాడు.

''చూడు! అందమనేది మనసు అంగీకరించడాన్నిబట్టి వుంటుంది. ఒక వ్యక్తి రూపం మరో వ్యక్తి



ఎందుకు ఆకర్షిస్తుందీ అనేది వ్యక్తిగతమైన అనుభూతే! మన విషయమే చూడు. నీఅంత అందమైన ఆడదాన్ని మరెవర్నీ నేను చూడలేదు. మరి, నేనెలా వుంటాను? మన జంట- కాకి ముక్కుకి దొండపండులా వుంటుంది, బయట చూసే వాళ్ళకు. అయినా కూడా, నీ మనసు నన్నంగీకరించింది. అందుకే సుఖంగా నాతో కాపురం చేస్తున్నావు. ఆ పిల్ల, వాడి మనసుకు నచ్చింది. అందుకు మనం వొప్పుకోవడమే మంచిది. ఇప్పుడు కాదంటే, మళ్ళీ ఎప్పటికో!'' అన్నాడాయన.

ఆవిడ నిట్టూర్చి, సరేనంది.

ఈ మాటవిని, కామరాజుగారి కుమార్తె నీరజ ఆనందంతో పొంగిపోయింది. గతంలో, పెళ్ళిచూపుల పేరుతో నలుగురైదుగురొచ్చి చూసి వెళ్ళారు. వాళ్ళు నచ్చలేదంటే ఆమె మనసు చిన్నబోయింది.

'అందంగా లేకపోవడం నా తప్పా? నేనేం చేయను?' అనుకుని బాధపడేది.

కాని ఇప్పుడు, ఆనందమూర్తి లాంటి కళాహృదయుడికి తను నచ్చానంటే, తనలో అందమైన అంశం ఏదో వున్నదన్నమాట! ఆ సౌందర్యాంశాన్ని అతను గుర్తించగలిగాడు అనుకుని సంబరపడింది. సడలిపోయిన ఆమెలోని ఆత్మవిశ్వాసం అలా పాదుకోవడం మంచిదేకదా!

తన తండ్రికంటే, ఆనందమూర్తి తలిదండ్రులు ఆర్థికంగా బాగా పై స్థితిలో వున్నవాళ్ళు. అటువంటి ఆనందమూర్తి తనను మెచ్చి, కట్నం లేకుండా చేసుకుంటానంటే, ఆమె మురిసిపోయింది.

వారి పెళ్ళి వైభవంగా జరిగింది.

ఆనందమూర్తి భార్యను అపురూపంగా చూసుకుంటున్నాడు. ఆమెతో చాలా ప్రేమగా వుంటున్నాడు.

ఆ తర్వాత కూడా మనోహరమైన అందాన్ని చూసినపుడు ఆనందమూర్తి తనకు కలిగే అద్భుతమైన ఆనందానుభూతిని ఏదోరూపంగా ప్రకటిస్తూనే వున్నాడు! ప్రకృతి లాస్యాన్ని చూసి పరవశిస్తూనే వున్నాడు. అందమైన స్త్రీల చిత్రాలను గీస్తూనే వున్నాడు.

అతని తల్లికిప్పటికీ అర్థం కావటంలేదు. 'ఎందుకు వీడు తన పెళ్ళి విషయంలో, భార్య అందం విషయంలో ఇలా రాజీ పడిపోయాడు? ఒకవేళ, పిల్ల నచ్చలేదని వచ్చిన ప్రతి సంబంధమూ దాటవేస్తుంటే, చివరకు తన పెళ్ళి బాగా ఆలస్యమైపోతుందని కంగారు పడ్డాడా? అలాంటి అవకాశమే లేదు. ఎందుకంటే, పెళ్ళినాటికే వాడికి మంచి సంబంధాలొస్తూనే వున్నాయి. అయినా కూడా ఎందుకిలా నిర్ణయం తీసుకున్నాడు?' అనేది ఆమె అనుమానం.

ఒకనాడు ఆనందమూర్తి తన గదిలో కూర్చుని బొమ్మలు గీసుకుంటున్నాడు. కోడలక్కడ లేదు. ఆవిడ, గదిలోకెళ్ళి కొడుకు దగ్గరగా కూర్చుంది. ఆమాటా ఈమాటా మాటాడింది. తర్వాత మెల్లగా అంది-

''ఏరా, ఓమాటడుగుతాను. నిజం చెబుతావా?''

''అడుగమ్మా. ఎందుకు చెప్పను!'' అన్నాడు.

''అందమంటే నీకెంతో ఇష్టం. ఇప్పటికీ అందమైన బొమ్మలు గీస్తూనే వున్నావు. పెళ్ళికి ముందు అప్సరసల్లాంటి పిల్లల్ని చూసికూడా చేసుకోనన్నావు. నీరజ అందం తెలిసిందే! మరి నీకెలా నచ్చిందిరా? ఎందుకీ విషయంలో రాజీ పడ్డావు?'' అనడిగింది.

ఆనందమూర్తి చేతిలోని వస్తువుల్ని క్రిందపెట్టి, కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని, నిదానంగా చూస్తూ అన్నాడు-

''అమ్మా! అందం అనేది మన ఇష్టం కాదు. అందంగా వుండాలని కోరుకుని పుట్టే అవకాశమే వుంటే, అందరూ అలా కోరుకుని అందంగానే పుట్టేవారు. లేనపుడు, అందంగా లేకపోవడం, ఆ అమ్మాయి చేసిన తప్పు కాదు కదమ్మా! అయినా కూడా, ఒక ఆడపిల్లను 'నీవు అందంగా లేవు, లేవు' అని పలుమార్లంటే ఆమె మనసెంత చిన్నబోతుందో, ఎంత దిగాలు పడుతుందో ఆలోచించు. అందమైన వస్తువునూ, అందమైన స్త్రీనీ చూసినపుడు ఆనందం కలుగుతుంది. నిజమే! కాని, వస్తువూ స్త్రీ ఒకటి కాదమ్మా. స్త్రీకి ప్రతిస్పందించే మనసుంటుంది! అందుకే, ఇటువంటపుడు మనిషీ, స్త్రీలో మానవతాంశను చూడాలి. మానవతాంశను చూడగలిగితే, ఆమె మాత్రమే అందంగా కనిపించడంకాదు, లోకమంతా కూడా మరింత అందంగా కనిపిస్తుంది. ఆ అందమే నిజమైన ఆనందాన్ని కలిగిస్తుందమ్మా!'' అన్నాడు నిశ్చయ స్వరంతో. తల్లి అతనివంక ఆశ్చర్యంగా చూసింది. అందాన్ని ఆరాధించే అమాయకుడూ, బోళామనిషి అనుకున్న తన కొడుకులో ఎంత గంభీరమైన ఆలోచనలున్నాయి! మానవతా దృష్టితో చూస్తే, స్త్రీ మాత్రమే కాదు, లోకమంతా కూడా అందంగా కనిపిస్తుందని సౌందర్య తత్వాన్ని వివరించాడు! వీడే నిజమైన సౌందర్యారాధకుడు!' అనుకుని మురిసిపోయింది. కొడుకుని ఆశీర్వదించింది.

★